# పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- నామినేషన్ల ప్రక్రియను సీసీ కెమెరాల సమక్షంలో నిర్వహించాలి
- అభ్యర్థుల వ్యయ, వివరాలను పక్కాగా సేకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ



అధికారుల సమావేశంలో కలెక్టర్ భారతి హోలీకేరీ

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో వచ్చే నెల 3 నుంచి చేపట్టే నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలీకేరీ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్లు స్వీకరించే రోజునుంచి ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు సూచికలు ఏర్పాటు చేసి ఇతరులు ప్రవేశించకుండా చూడాలని ఆమె సూచించారు. నామినేషన్లు వేసేవారితో పాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించాలని.. 11 గంటలకు ముందు మధ్యాహ్నం 3 గంటల తర్వాత నామినేషన్లు స్వీకరించవద్దని, నామినేషన్లు, స్క్రూట్నీ ఎప్పుడు, ఎక్కడ నిర్వహిస్తారనేది సమాచారం అభ్యర్థులకు తెలియజేయాలని, అందుకు కావల్సిన ఏర్పాట్లను చేసుకోవాలని పేర్కొన్నారు. నామినేష్ల పూర్తి ప్రక్రియను సీసీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నామినేష్ల ప్రక్రియపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన ఉండాలని, అదేవిధంగా అభ్యర్థులకు తెలియజేయాలన్నారు. ఎన్‌కోర్ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల పూర్తి సమాచారాలతో నామినేషన్లను పొందుపర్చాలని సూచించారు. నామినేషన్ల ప్రక్రియ దాఖలైనప్పటి నుంచి అభ్యర్థుల వ్యయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదికల ద్వారా సమర్పించాలని ఆదేశించారు. అభ్యర్థుల వివరాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఎన్నికల అధికారి నారాయణరెడ్డి తదితరులు

# ఎన్నికలపై అవగాహన అవసరం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి
- రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

వికారాబాద్, అక్టోబర్ 28 : ఎన్నికల విధుల పట్ల అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం భారత ఎన్నికల సంఘం, ఢిల్లీ నుంచి తెలంగాణ రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల విధులపై సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, లింగ్యా నాయక్, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరం నుంచి పాల్గొన్నారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి మాస్టర్ శిక్షకులు, నామినేషన్లు, నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు, వివిధ అనుమతుల మంజూరు, పోలింగ్ రోజు ఏర్పాట్లు, పోస్టల్ బ్యాలెట్, సువిధ, ఎన్కోర్, ఓట్ల లెక్కింపు విధానంపై వివరిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ, రిటర్నింగ్ సహాయ రిటర్నింగ్ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధులు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాల్సి ఉంటుందన్నారు. సందేహాల నివృత్తి కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ఆన్‌లైన్ సెషన్‌ను సద్వినియోగం చేసుకొని, విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. శాసన సభ ఎన్నికల విధి నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ఇతర ఎన్నికల సిబ్బంది ఎవ్వరు కూడా తప్పులు జరగకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మోడల్ కోడ్‌ను పక్కాగా అమలుపరచాలని, సమావేశాలు, బహిరంగ సభలు, వాహనాలకు తప్పనిసరిగా అనుమతులుండేలా చూడాలన్నారు. నామినేషన్ ప్రక్రియ దాఖలైనప్పటి నుంచి అభ్యర్థుల వ్యయ సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులందరూ ఇలాంటి పొరపాట్లు జరగకుండా అవగాహనతో విధులు నిర్వహించాలని సూచించారు.



అనంతపద్మనాభస్వామి ఆలయాన్ని మూసివేసిన అధికారులు

## చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాలు మూసివేత

వికారాబాద్, అక్టోబర్ 28 : చంద్రగ్రహణం సందర్భంగా వికారాబాద్ అనంతపద్మనాభస్వామి దేవాలయాన్ని మూసివేసినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఆలయ ఈవో నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఆదివారం ఉదయం 9 గంటల వరకు ఆలయాన్ని మూసివేయనున్నట్లు చెప్పారు. ఆలయ శుద్ధి అనంతరం భక్తులకు పునర్దర్శనం ఉదయం 11 గంటలకు కల్పించబడుతుందన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

మొయినాబాద్ : 29న తెల్లవారుజామున 1.05 నుంచి 2.22 గంటల వరకు పాక్షిక చంద్ర గ్రహణం నేపథ్యంలో 28న సాయంత్రం చిలుకూరు బాలాజీ ఆలయాన్ని మూసివేశారు. తిరిగి 29న నుంచి 29న చిలుకూరు బాలాజీ ఆలయాన్ని అర్చకులు మూసి వేశారు. 29వ తేదీన ఉదయం ఏకాంతంలో ఆలయాన్ని శుద్ధి చేసి పుణ్యాహవచనం, అర్చన చేసిన తరువాత భక్తులు స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉంటుందని అర్చకుడు రంగరాజన్ పేర్కొన్నారు. భక్తులు 7 గంటల తరువాతనే ఆలయానికి రావాలని తెలిపారు. గ్రహణ సమయానికి 8 గంటల ముందే ఆలయాన్ని మూసివేయడం అనవాయితీ అని పేర్కొన్నారు.



చిలుకూరు బాలాజీ ఆలయం..

# అవాస్తవాలు.. వక్రీకరణలు

- కర్ణాటకలో 5 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నామంటూ కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలు
- రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామంటూ కాంగ్రెస్ మరోసారి రైతులను మోసం చేసే వ్యాఖ్యలు
- సీఎం తానే అంటూ చెప్పించుకుంటున్న రేవంత్‌రెడ్డి
- డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందంటూ శివకుమార్ మాట్లాడగా.. రేవంత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని వక్రీకరణ

వికారాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : కర్ణాటకలో వ్యవసాయానికి 7 గంటల కరెంట్ సరఫరా చేస్తామని హామీనిచ్చి 5 గంటల కరెంట్ సరఫరా చేస్తున్నామని సాక్షాత్తు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలతో రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరేందో అర్థమైంది. శనివారం వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో కాంగ్రెస్ బస్సు యాత్ర సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి సంబంధించి కర్ణాటకలో అమలు చేస్తున్న మాదిరి తెలంగాణలోనూ కరెంట్ సరఫరా చేస్తామని చెప్పడంతో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రం అంధకారం కానుందనేది చెప్పకనే చెప్పారు. తెలంగాణలో 24 గంటల నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తుండగా.. 7-8 గంటలే సరఫరా చేస్తున్నారంటూ అవాస్తవాలను ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ.. కర్ణాటకలో కనీసం 7 గంటల కరెంట్ ఇవ్వలేని కాంగ్రెస్‌ను తెలంగాణలో గెలిపిస్తే రైతులకు కష్టాలు తప్పవనేది అర్థమవుతున్నది. వ్యవసాయానికి 5 గంటల కరెంట్ ఇచ్చే కాంగ్రెస్ పార్టీ కావాలో.. 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసే బీఆర్ఎస్ పార్టీ కావాలో రైతులు ఆలోచించాల్సిన అవసరముంది.

### నిరంతర విద్యుత్ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదం

పేదలకు నిర్మించి ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్లు మొదలుకొని ప్రతీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన కాంగ్రెస్ పార్టీ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ పథకం ఫలాలు నేరుగా లబ్ధిదారులకు అందజేస్తుంటే లంచాలు ఎక్కువయ్యాయని రేవంత్‌రెడ్డి మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంది. గతంలో వ్యవసాయానికి కేవలం ఉదయం 4 గంటలు, రాత్రి మూడు గంటల కరెంట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరంతర విద్యుత్తు సరఫరా చేస్తామని హామీనివ్వడం హాస్యాస్పదం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హైదరాబాద్‌లో నిత్యం కర్ఫ్యూలతో జనం భయంభయంతో బతికిన పరిస్థితులను మరిచిన రేవంత్.. మతసామరస్యాలను కాపాడింది కాంగ్రెస్ పార్టీ అనడం హాస్యాస్పదం. తెలంగాణలోని ప్రాజెక్టులు ఇతరత్రాల్లో ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు బయటపెడుతూ వాస్తవాలను జనం ముందుంచుతున్న నమస్తే తెలంగాణపై కూడా రేవంత్‌రెడ్డి తన అక్కసు వెళ్లగక్కడం గమనార్హం.

### తానే సీఎం అంటూ చెప్పించుకున్న రేవంత్‌రెడ్డి

తానే సీఎం అంటూ కలలు కంటుంటే ఆ పార్టీ సీనియర్ నాయకులు మాత్రం గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది. తాండూరు, పరిగిలో జరిగిన కాంగ్రెస్ బస్సు యాత్ర సందర్భంగా ప్రసంగం మొదలుకొని ముగిసే వరకు సీఎం సీఎం చెప్పించుకోవడం గమనార్హం. శివకుమార్ డిసెంబర్ 9న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని మాట్లాడగా.. డిసెంబర్ 9న రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని పరిగి కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి అనువాదం చేయడంపై జనం నవ్వుకున్నారు. ఇప్పటికే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, జగ్గారెడ్డి సీఎం అభ్యర్థులుగా చెప్పుకుంటున్న నాయకులతో పాటు మిగతా సీనియర్ నాయకులంతా రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ బస్సు యాత్ర అట్టర్ ఫ్లాప్ అయ్యింది. పక్కనున్న కర్ణాటకతోపాటు రూ.500 ఇచ్చి బస్సు యాత్రకు తీసుకువచ్చిన జనం రేవంత్ రెడ్డి ప్రసంగం ప్రారంభించిన వెంటనే వెనుదిరిగారు. డీకే శివకుమార్ మాట్లాడే సమయానికి కనీసం వెయ్యి మంది కూడా లేకపోవడం గమనార్హం.

## టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ, అక్టోబర్ 28 : టీ-సేవ బ్యాంకు మిత్ర కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణవ్యాప్తంగా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు టీ-సేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ టీ-సేవ బ్యాంకు మిత్ర ద్వారా డెబిట్‌కార్డ్స్, లైఫ్‌టర్మ్ ఇన్సూరెన్స్ చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్స్ బుకింగ్, కొత్త పాన్‌కార్డు, టెలికాం పోస్ట్‌పెయిడ్, ప్రీపెయిడ్, ఆల్ బ్యాంక్స్ మనీ ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ పెమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ అర్హత గల యువతి, యువకులు వచ్చే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొవచ్చని కోరారు. వివరాలకు 8179955744, ఆన్‌లైన్‌లో www.tsevacentre.com లో సంప్రదించాలన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాశ్‌రెడ్డి

## ప్రింటింగ్ ఏజెన్సీలు నిబంధనలు అతిక్రమించొద్దు

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): బల్దియా పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు హైదరాబాద్ జిల్లా అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలతో నోడల్ అధికారి ఎన్.ప్రకాశ్ రెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో (మోడల్ కోడ్) ఎన్నికల కోడ్ అమలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కర పత్రాలు, పోస్టర్లు, పత్రికల్లో వచ్చే ప్రకటనలపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రింటింగ్ ఏజెన్సీలు నిబంధనలు పాటించాలన్నారు. పోస్టర్లు, కరపత్రాలపై పబ్లిషర్ వివరాలను తప్పనిసరిగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రింటింగ్ ఏజెన్సీలకు సూచించారు. ఆర్డర్లకు సంబంధించిన వివరాలను mccelectionadvts@gmail. com ద్వారా ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు.